సాక్షి
కుమురం భీం
బుధవారం ၊ 18 ၊ అక్టోబర్ ၊ 2023





**బెంగాలీలే నిర్ణేతలు!**
రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో సిర్పూర్‌లో బెంగాలీలు కీలకంగా మారనున్నారు. మొత్తం 17 గ్రామాల్లో సుమారు 26 వేల జనాభా, 20 వేల మంది ఓటర్లు ఉన్నారు. 10లో▸



**బతుకమ్మ సంబరాలు**
జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ సంబురాలు కొనసాగుతున్నాయి. కళాశాలలతోపాటు గ్రామాల్లో బతుకమ్మలు పేర్చి మహిళలు, యువతులు ఆడిపాడారు. 11లో▸

గరిష్టం/కనిష్టం
34.8 /23.6

**వాతావరణం**
వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా ఎక్కువగా నమోదవుతాయి. సాయంత్రం చినుకులు పడే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### ఎస్‌జీటీయూ జిల్లా కార్యవర్గం


వినోద్, జిల్లా ప్రధాన కార్యదర్శి

ఆసిఫాబాద్‌రూరల్: సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి ఆదేశాలకు మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలో ఎస్‌జీటీయూ నూతన జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా తాళ్లపల్లి శ్రావణ్, ప్రధాన కార్యదర్శిగా వైరాగడే వినోద్, గౌరవ అధ్యక్షుడిగా నాగరాజును ఎన్నుకున్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని వారు తెలిపారు.

### గిరిజన విద్యార్థినికి బంగారు పతకం


సాక్షితో అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సాక్షి అనే విద్యార్థి జూనియర్ అథ్లెటిక్స్‌లో సత్తా చాటింది. జావెలిన్ త్రో విభాగంలో బంగారు పతకం సాధించినట్లు డీఎస్‌వో మీనారెడ్డి తెలిపారు. ఈ నెల 15 నుంచి 17 వరకు వరంగల్‌లో నిర్వహించిన జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సాక్షి జావెలిన్ త్రో విభాగంలో ఈటెను 37.82 మీటర్ల దూరం విసిరి జాతీయస్థాయి రికార్డు సృష్టించిందని పేర్కొన్నారు. విద్యార్థిని మంగళవారం డీటీడీవో రమాదేవి, ఏసీఎంవో ఉద్ధవ్, కోచ్ విద్యాసాగర్ అభినందించారు.

### 'భగీరథ' కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: మిషన్ భగీరథ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు పెండింగ్ నిధులు విడుదల చేయాలని కార్మిక సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు వరంగల్‌లో మంగళవారం జాయింట్ లేబర్ కమిషనర్ సునీతకు వినతిపత్రం అందించారు. నాయకులు మట్లాడుతూ జీవో 11ను అడ్డుపెట్టుకుని కార్మికులకు అన్‌స్కిల్డ్ వేతనాలు ఇవ్వడం సరికాదన్నారు. నాలుగు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని, బోనస్ యూనిఫాం సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు నిధుల్లో అవకతవకలు జరిగాయని జాయింట్ లేబర్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దరఖాస్తు చేసుకున్న కార్మికులు బయోమెట్రిక్ విధానంతో తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు లోకేశ్, దుర్గం లింగయ్య, బుద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

### రిజిష్టర్లు సక్రమంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న డీఈవో అశోక్

కాగజ్‌నగర్‌రూరల్: పాఠశాలల అడ్మిషన్, విద్యార్థుల హాజరు రిజిష్టర్లను సక్రమంగా నిర్వహించాలని డీఈవో పార్శి అశోక్ అన్నారు. పట్టణంలోని డీఆర్‌సీ కార్యాలయంలో మంగళవారం ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాళ్లతో డివిజన్‌స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ అనుమానాలకు తావులేకుండా రిజిష్టర్ల నిర్వహణ ఉండాలన్నారు. పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులకు బోనఫైడ్ సర్టిఫికెట్లు ఇచ్చేటప్పుడు అడ్మిషన్ రిజిష్టర్లను తనిఖీ చేయాలని సూచించారు. ఏదైనా పొరపాటు జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో పరీక్షల సహాయ కమిషనర్ ఉదయబాబు, ఎంఈవో భిక్షపతి, కోఆర్డినేటర్ అబాద్ అలీ, జిల్లా సైన్స్ అధికారి మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

# లాస్ట్ చాన్స్!

- ఎన్నికలకు ముందు ఓటరు నమోదుకు చివరి అవకాశం
- అర్హులు ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు..
- జిల్లాలో మరింత పెరగనున్న యువ ఓటర్లు
- రానున్న ఎన్నికల్లో వారే కీలకం..






జంగ్ తెలంగాణ

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో హడావుడి మొదలైంది. పోలింగ్ శాతం పెంచడంపై ఎన్నికల సంఘం ప్రత్యేక దృష్టి సారించింది. జిల్లాల వారీగా ప్రత్యేకాధికారులను నియమించి ఓటుహక్కు వినియోగంపై ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తోంది. రానున్న ఎన్నికల్లో యువ ఓటర్లు కీలకం కానుండగా, ఎలక్షన్‌కు ముందు ఓటరు నమోదుకు ఈ నెల 30 వరకు మరో అవకాశం కల్పించింది.

కౌటాల(సిర్పూర్): రాష్ట్రంలో నవంబర్ 30న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. జిల్లాలో బీఆర్‌ఎస్, బీఎస్పీ(సిర్పూర్) మినహా కాంగ్రెస్, బీజేపీ, ఇతర పార్టీలు ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులను ప్రకటించలేదు. షెడ్యూల్ రావడంతో ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. పోలింగ్‌కు అధికారులు ఏర్పాట్లు చేస్తుండగా.. పోలీస్ అధికారులు జోరుగా తనిఖీలు చేపడుతున్నారు.

### జిల్లాలో రెండు సెగ్మెంట్లు

జిల్లాలో సిర్పూర్(టి), ఆసిఫాబాద్ రెండు నియోజకవర్గాలు ఉన్నాయి. ఎన్నికల నిర్వహణకు తీవ్ర కసరత్తు చేసిన ఎన్నికల సంఘం ఈ నెల 4న తుది ఓటరు జాబితాను విడుదల చేసింది. జిల్లా వ్యాప్తంగా 4,47,634 మంది ఓటర్లు ఉన్నారు. ఆసిఫాబాద్‌లో నియోజకవర్గంలో 1,11,878 మంది పురుషులు ఉండగా, 1,12,766 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. 888 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలో పురుషులు 1,11,924 మంది, మహిళా ఓటర్లు 1,11,039 మంది ఉన్నారు. ఈ ఏడాది జనవరిలో విడుదల చేసిన జాబితా కంటే కొత్తగా 16,388 మంది ఓటర్లు పెరిగారు. వివిధ కారణాలతో 11,030 మంది ఓటు హక్కును జాబితా నుంచి తొలగించారు. అలాగే రెండు నియోజకవర్గాల్లో గడిచిన ఐదేళ్లలో ఓటర్ల సంఖ్య భారీగా పెరిగింది. 2018 డిసెంబర్ 7న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 3,77,245 మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. తాజా ఓటరు జాబితా ప్రకారం 4,47,634 మంది ఓటర్లుగా నమోదయ్యారు. గత ఎన్నికలతో పోల్చితే కొత్తగా 70,119 మంది పెరిగారు. 70 వేలకు పైగా కొత్త ఓటర్లు పెరగడంతో నాయకుల గెలుపోటములపై వారు ప్రభావం చూపే అవకాశం ఉంది.

**జిల్లా వివరాలు**

| నియోజకవర్గం | పోలింగ్ కేంద్రాలు | పురుషులు | మహిళలు | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|---|
| సిర్పూర్ | 293 | 1,11,924 | 1,11,039 | 10 | 2,22,973 |
| ఆసిఫాబాద్ | 304 | 1,11,878 | 1,12,766 | 17 | 2,24,661 |

**వయస్సుల వారీగా ఓటర్లు**

| వయస్సు | ఓటర్లు |
|---|---|
| 18- 19 | 16,555 |
| 20- 29 | 1,02,225 |
| 30- 39 | 1,21,257 |
| 40- 49 | 85,146 |
| 50- 59 | 62,046 |
| 60- 69 | 37,217 |
| 70- 79 | 17,418 |
| 80 పైగా | 5,770 |

### యువతే కీలకం..

త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకునేందుకు యువతరం ఉవ్విళ్లూరుతోంది. ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు చేపట్టడంతో వారిలో అవగాహన పెరిగింది. ఓటు హక్కుతోనే సమర్థుడైన నాయకుడిని ఎన్నుకునే అవకాశం ఉందని యువత బలంగా నమ్ముతోంది. తుది ఓటరు జాబితాలో కొత్త ఓటర్లు (18-19 వయస్సు) వారు 16,555 మంది ఉన్నారు. వీరు తొలిసారి తమ ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. అలాగే 18- 39 వయస్సు వారు 2,40,037 మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం ఓటర్లలో 53.63 శాతం యువతే ఉండటంతో ఫలితాలను ప్రభావితం చేసే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. యువత చేతుల్లోనే అభ్యర్థుల భవిష్యత్తు ఉండనుంది. యువత ఎవరి వైపు మొగ్గు చూపితే ఎన్నికల్లో వారి గెలుపు సులువు కానుంది. ఈ నేపథ్యంలో యువతను ఆకర్షించడానికి పలు సంస్థల పేరిట రాజకీయ పార్టీలు దసరా పండగకు క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ముగ్గుల పోటీలు నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నాయని తెలుస్తోంది. మరోవైపు యువతను ఆకర్షించడానికి నియోజకవర్గానికో యూత్ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడానికి ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది.

**ఓటరు నమోదుకు మరో అవకాశం**
అసెంబ్లీ ఎన్నికల్లో ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. 2023 అక్టోబర్ 1తో 18 ఏళ్లు నిండి, గతంలో దరఖాస్తు చేసుకోనివారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల దాఖలకు 10 రోజుల ముందు వరకు దరఖాస్తు చేసుకుంటే, అర్హులైన వారికి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం కల్పించనున్నారు. https://voters. eci. gov. in వెబ్‌సైట్‌తోపాటు ఓటరు హెల్ప్‌లైన్ యాప్, బీఎల్‌వో ద్వారా ఓటరు నమోదుకు అవకాశం ఉంది. అలాగే తమ పోలింగ్ స్టేషన్, ఇతర వివరాలు తెలుసుకోవచ్చు. ఏమైన ఫిర్యాదులుంటే ఓటరు హెల్ప్‌లైన్ నంబర్ 1950ను సంప్రదించాలని ఎన్నికల అధికారులు సూచించారు. ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఈ అవకాశాన్ని వినియోగించుకుని 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఈ నెలాఖరులోగా ఓటరుగా నమోదు చేసుకోవాలని వారు కోరుతున్నారు.

### ప్రజలే బుద్ధి చెబుతారు

- ఎమ్మెల్యే కోనేరు కోనప్ప


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

కాగజ్‌నగర్‌రూరల్: తనపై అసత్య ఆరోపణలు చేస్తున్న నాయకులకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. పట్టణంలోని మైనార్టీ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 108 అంబులెన్స్ తరహాలో తాను 24 గంటలపాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి చేశానని పేర్కొన్నారు. బీఎస్పీ, బీజేపీలను ప్రజలు చిత్తుగా ఓడించడం ఖాయమన్నారు. చివరి శ్వాస వరకు ప్రజలకు సేవ చేస్తానని వివరించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌లోకి చేరిన వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు, జిల్లా కోఆప్షన్ సభ్యుడు సిద్దిక్, మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్, మాజీ మున్సిపల్ చైర్మన్ దస్తగీర్, పట్టణ అధ్యక్షుడు ప్రసాద్, నాయకులు ఫైజల్, షబ్బీర్, శంకర్, రాజేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### నాణ్యమైన విద్యనందించాలి


మాట్లాడుతున్న డీఐఈవో శంకర్

వాంకిడి(ఆసిఫాబాద్): విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని డీఐఈవో ఎస్.శంకర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. కళాశాల రికార్డులు తనిఖీ చేసి, విద్యార్థుల ప్రతిభపై సంతృప్తిని వ్యక్తం చేశారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, బోధనా విధానాలపై కళాశాల సిబ్బందిని అభినందించారు. అనంతరం డీఐఈవోను అధ్యాపకులు, విద్యార్థులు శాలువాతో సన్మానించారు.

## ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే


కంప్యూటర్‌లో వివరాలు పరిశీలిస్తున్న కలెక్టర్

ఆసిఫాబాద్: అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసిన సీ విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం, మీడియా సెంటర్లను అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున అధికారులు తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. సీ విజిల్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో ఉండే ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలకు చేరవేసి తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతీ ఫిర్యాదును రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్నంత వరకు కంట్రోల్ రూం నుంచి ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో కంట్రోల్ రూం ఇన్‌చార్జి గౌతమ్, రాము, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**ఫిర్యాదులపై వేగంగా స్పందించాలి**
ఎన్నికల ఫిర్యాదులపై సంబంధిత అధికారులు వేగంగా స్పందించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం అదనపు కలెక్టర్ దాసరి వేణు, నోడల్ అధికారులు, వీడియో సర్వేయలెన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంకు ఫిర్యాదులు అందిన వెంటనే సంబంధిత రిటర్నింగ్ అధికారులకు సమాచారం అందించి పరిష్కారం దిశగా కృషి చేయాలన్నారు. 90 నిమిషాల్లోపు సంబంధిత ప్రాంతానికి చేరుకుని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విధుల్లో ఉండే అధికారులు, సిబ్బంది 24 గంటలపాటు అప్రమత్తంగా ఉండాలన్నారు. తనిఖీల్లో పట్టుబడిన నగదును సీజ్ చేసి జిల్లా కోశాధికారి కార్యాలయానికి తరలించాలని ఆదేశించారు. జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని అన్నారు.

## 'మేనిఫెస్టోతో కొత్త డ్రామాలు'


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: మరోసారి అధికారంలోకి రావాలనే ఉద్దేశంతోనే బీఆర్‌ఎస్ పార్టీ మేనిఫెస్టోతో కొత్త డ్రామాలకు తెరలేపిందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేశం అన్నారు. పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014, 2018 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మరోమారు రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించి అబద్ధాలతో గద్దెనెక్కాలని చూస్తున్నారని ఆరోపించారు. మేనిఫెస్టో పెద్ద అబద్ధాల చిట్ట అని విమర్శించారు. కేసీఆర్ హామీలు అధికారం కోసమే తప్ప ప్రజలకు ఒరిగేదేమి లేదని స్పష్టం చేశారు. సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు విశ్వేశ్వర్‌రావు, పట్టణ అధ్యక్షుడు సిందం శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు మాచర్ల శ్రీనివాస్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## 'ఉపాధి'కి తీర్మానం!

- ఈజీఎస్ పనుల గుర్తింపు కోసం జిల్లా వ్యాప్తంగా గ్రామ సభలు
- 2024- 25 ఆర్థిక సంవత్సరానికి పనుల గుర్తింపు
- ప్రజల అభీష్టం మేరకు తీర్మానం
- వందశాతం లక్ష్యం చేరుకునేలా ప్రణాళికలు

**జిల్లా వివరాలు**

| | |
|---|---|
| జాబ్‌కార్డులు | 1,21,00 |
| కూలీల సంఖ్య | 2,46,000 |
| 2023-24లో పనిదినాల లక్ష్యం | 21లక్షలు |
| ఇప్పటి వరకు గుర్తించినవి | 25,18,000 |


వాంకిడి గ్రామసభలో చర్చిస్తున్న ప్రజలు, అధికారులు (ఫైల్)

ఆసిఫాబాద్‌అర్బన్: ఉపాధిహామీ పథకం గ్రామాల్లో ఎంతో మంది పేదలకు ఉపాధి కల్పిస్తూ ఆర్థిక భరోసాను కల్పిస్తోంది. గడ్డుకాలంలో ఎన్నో కుటుంబాలు ఈజీఎస్ పనులను సద్వినియోగం చేసుకుంటున్నాయి. అంతేకాక వ్యవసాయాన్ని అనుసంధానం చేసే దిశగా ఇప్పటికే కుంటల నిర్మాణం, మొక్కల పెంపకం, నీటి సంరక్షణ, తదితర పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా 2024- 25 ఆర్థిక సంవత్సరానికి ఉపాధిహామీ పనులు ఖరారు చేసేందుకు ఈజీఎస్ అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన పనులను గుర్తిస్తున్నారు. ఆయా పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించి ప్రజల అభిప్రాయం మేరకు తీర్మానం చేస్తున్నారు.

**డిసెంబర్ 31నాటికి ప్రణాళికలు**
జిల్లాలో 15 మండలాల పరిధిలో మొత్తం 335 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో ఏజెన్సీ, నాన్‌ఏజెన్సీ ప్రాంతాలు ఉన్నాయి. ఉపాధి హామీ పనులు గుర్తించేందుకు జిల్లాలో నెల రోజులుగా ఈజీఎస్ గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. వీటిని నవంబర్ 30 వరకు పూర్తిచేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అనంతరం డిసెంబర్ 31నాటికి పూర్తి వివరాలతో ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి సమర్పించేందుకు కసరత్తు చేస్తున్నారు. గ్రామ స్థాయిలో తీర్మానించిన పనులను మండల పరిషత్, జిల్లా పరిషత్‌కు పంపించనున్నారు. 2024 మార్చి 31 వరకు ఆమోదించిన పనులను వచ్చే ఆర్థిక సంవత్సరంలో.. అంటే ఏప్రిల్ 1 నుంచి చేపడతారు. గ్రామ పంచాయతీల్లో సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, రైతులు, గ్రామస్తులు, ఉపాధి సిబ్బందితో గ్రామ సభను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. సీజన్ల వారీగా చేపట్టాల్సిన పనుల గురించి చర్చించిన తర్వాత పంచాయతీ ఆధ్వర్యంలో తీర్మానం చేయాలి. ఈ ప్రక్రియ నవంబర్ 30 వరకు కొనసాగనుంది.

**ప్రజలు ఆమోదించిన పనులే..**
గతంలో కూలీలు, ప్రజల భాగస్వామ్యం లేకుండా ఉపాధిహామీ పనులు చేపట్టేవారు. అయితే సామాజిక తనిఖీల్లో భారీగా అక్రమాలు వెలుగులోకి వస్తుండటంతో ప్రభుత్వం పారదర్శకత కోసం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ప్రజలు ఆమోదించి, గ్రామ సభలు తీర్మానించిన పనులే చేపట్టాలని నిర్ణయించింది. అలాగే ఇష్టారీతిన పనులు చేపట్టకుండా పరిమితి విధించింది. ప్రస్తుతం పంచాయతీకి 20కి మించి పనులు నిర్వహించే అవకాశం లేదు. పనులు పూర్తిచేసిన తర్వాతే మిగిలిన పనులు చేపట్టేందుకు మార్గం ఉంటుంది. దీని ద్వారా అసంపూర్తిగా పనులు చేపట్టి, నిధులు పక్కదారి పట్టే అవకాశం ఉండదని అధికారులు చెబుతున్నారు. అంతేకాక వచ్చే ఆర్థిక సంవత్సరంలో 17 రకాల పనులు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా భూగర్భ జలాల పెంపునకు కృషి చేసేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నారు. రైతులకు ఉపయోగపడే విధంగా చెరువులు, కాలువలు, కుంటల్లో పూడికతీత పనులు, వరద కాలువల్లో పిచ్చిమొక్కలు తొలగించడం, నీటి కుంటలు, కందకాల నిర్మాణం తదితర పనులకు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

**మండలాల వారీగా వివరాలు**
ఉపాధిహామీ పనుల్లో పారదర్శకత, స్థానిక అవసరాల దృష్ట్యా ప్రజలు, కూలీల భాగస్వామ్యంతో పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించి తీర్మానం చేస్తున్నాం. ఆ తర్వాత మండలాల వారీగా సేకరించిన వివరాలను క్రోడీకరించి నివేదికలు రూపొందిస్తాం. అనంతరం కలెక్టర్ అనుమతితో ప్రభుత్వానికి నివేదిస్తాం. క్షేత్రస్థాయిలో ఈజీఎస్, పంచాయతీ సిబ్బంది సకాలంలో సభలు నిర్వహించి, తీర్మానాలు చేయించాలి.
– సురేందర్, డీఆర్‌డీవో

## గుండి ఉప సర్పంచ్ రాజీనామా

ఆసిఫాబాద్‌రూరల్: ఆసిఫాబాద్ మండలం గుండి గ్రామ ఉప సర్పంచ్ శేషాద్రి పదవికి రాజీనామా చేశారు. జిల్లా కేంద్రంలోని డీపీవో కార్యాలయంలో మంగళవారం రాజీనామా పత్రం అందించారు. శేషాద్రి మాట్లాడుతూ 2018లో జరిగిన ఎన్నికల్లో వార్డు సభ్యుడిగా గెలిచి ఉపసర్పంచ్‌గా ఎన్నికయ్యానని తెలిపారు. అయితే అధికారులు, ప్రజాప్రతినిధులు గుండి వాగుపై వంతెన నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చినా.. ఇప్పటివరకు వంతెన పూర్తికాకపోవడంతో రాజీనామా చేసినట్లు ఆయన తెలిపారు.

## ఆర్టీసీ అభివృద్ధికి పాటుపడాలి

- రీజినల్ మేనేజర్ సోలేమాన్
- ఉత్తమ కార్మికులకు సన్మానం


కార్మికుడిని సన్మానిస్తున్న అధికారులు

ఆసిఫాబాద్: కార్మికులు నిబద్ధతతో పనిచేసి ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి పాటుపడాలని ఆదిలాబాద్ రీజినల్ మేనేజర్ సోలేమాన్ అన్నారు. గత నెలలో అధిక ఆదాయం, మైలేజీ తెచ్చిన కండక్టర్లు, డ్రైవర్లను మంగళవారం జిల్లా కేంద్రంలోని డిపో ఆవరణలో డిప్యూటీ ఆర్‌ఎం ప్రణీత్‌కుమార్, డీఎం శ్రీధర్‌తో కలిసి శాలువాలతో సన్మానించారు. ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ దసరా సందర్భంగా గ్రాండ్ ఫెస్టివల్ చాలెంజ్‌ను కలిసికట్టుగా సక్సెస్ చేయాలని పిలుపునిచ్చారు. ఉత్తమ కార్మికులుగా కండక్టర్లు ఎం.వెంకటి, ఎస్.భీమన్న, గోవిందు, డ్రైవర్లు ఎస్.రవీందర్, కుమార్, మోహన్‌బాబు, అధిక మైలేజీ తెచ్చిన డ్రైవర్లు అయ్యూబ్ ఖాన్, ఎస్.రవీందర్, బద్రుద్దీన్, జీఎం బాబు, బెస్ట్ మెకానిక్ డి.తిరుపతి, బెస్ట్ ఆర్టిషియన్ డీఆర్ మారుతి, బెస్ట్ శ్రామిక్‌గా ఆర్.సత్తయ్య ఎంపికయ్యారు. వీరిని అధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

## అన్నపూర్ణదేవిగా దుర్గామాత

దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెబ్బెన మండలం ఇందిరానగర్‌లోని కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయంలో మూడోరోజు మంగళవారం దుర్గామాత అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. అమ్మవారిని రకరకాల కూరగాయలతో అలంకరించారు. రెబ్బెన, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, కౌటాల, సిర్పూర్, పెంచికల్‌పేట్, బెజ్జూర్ మండలాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. రాత్రి అమ్మవారి పల్లకీ సేవ, భజన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. - రెబ్బెన



## క్లుప్తంగా

### 'ఆ ఎమ్మెల్యేలపై కేసు నమోదు చేయండి'

- సీఎం వ్యాఖ్యల ఆధారంగా కోర్టులో పిటిషన్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: దళితబంధులో కొందరు ఎమ్మెల్యేలు అవినీతికి పాల్పడ్డారని సీఎం కేసీఆర్ గత ఏప్రిల్‌లో బీఆర్ఎస్ సమావేశంలో చెప్పిన వ్యాఖ్యల ఆధారంగా మంచిర్యాల జిల్లా నస్పూర్‌కు చెందిన ఆమ్ ఆద్మీ నాయకుడు నయీం పాషా మంచిర్యాల ఫస్ట్ క్లాస్ అడిషనల్ కోర్టులో కేసు వేశారు. అవినీతి నిరోధక చట్టం, ప్రజా ఆస్తి దుర్వినియోగం, రెవెన్యూ రికవరీ చట్టం, ప్రజాప్రాతినిధ్య చట్టాల కింద ప్రజాప్రతినిధులపై కేసులు నమోదు చేయాలని కోర్టు దృష్టికి తెచ్చారు. మంగళవారం ఈ కేసు విచారణ చేపట్టేందుకు జడ్జి ఉపనిషధ్వని దళితబంధు పథకంలో బాధితులు ఎవరైనా ఉంటే కోర్టు ముందు ప్రవేశ పెట్టాలని సూచించారు. వచ్చే నెల 29న తదుపరి ఈ కేసు విచారణ చేస్తామని ఆదేశాలు ఇచ్చారు. దీంతో పిటిషనర్ ఆ మేరకు ఆధారాలు తీసుకుంటానని కోర్టుకు నివేదించినట్లు తెలిపారు. 'సీఎం కేసీఆర్ కొందరు ఎమ్మెల్యేలు దళితబంధులో అక్రమాలకు పాల్పడ్డారని స్వయంగా వెల్లడించారు. ఆ మాటలు దినపత్రికలు, టీవీ చానళ్లలో వచ్చింది. దీనిపై అవినీతి నిరోధకశాఖ, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదు. దీంతో కోర్టులో కేసు వేశాను' అని నయీంపాషా 'సాక్షి'కి తెలిపారు. జిల్లాలో ఎవరైనా దళితబంధు లబ్ధిదారులు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులకు డబ్బులు ఇస్తే తెలుసుకుని కోర్టు ముందు ప్రవేశపెడతానని చెప్పారు.

### కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య

చింతలమానెపల్లి(సిర్పూర్): కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బాబాపూర్‌కు చెందిన పున్నెపురెడ్డి బాబాజీ (50) కొంతకాలంగా కడుపులో నొప్పితో బాధపడుతున్నాడు. ఆదివారం నొప్పి అధికం కావడంతో ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్సకోసం కాగజ్‌నగర్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందాడు. మృతుని కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### పోలీసుల ఉదారత



యువతిని అప్పగిస్తున్న సీఐ రాజు

మంచిర్యాలక్రైం: పట్టణంలోని కాలేజ్‌రోడ్‌లో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న ఓ యువతిని గమనించిన స్థానికులు 100కు సమాచారం అందించారు. సీఐ రాజు, ఎస్సై రాజేందర్ యువతికి స్థానిక కల్వరి యువశక్తి మానసిక వికలాంగుల ఆశ్రమంలో ఆశ్రయం కల్పించారు. విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో యువతి తండ్రి సర్వర్ గుర్తించి మంగళవారం పోలీసులను ఆశ్రయించారు. ఆధారాలు చూపించడంతో యువతిని అప్పగించారు.

### గంజాయి మొక్కలు పట్టివేత

జైనూర్: మండలంలోని రెండు వేర్వేరు గ్రామాల్లో పోలీసులు దాడులు నిర్వహించి గంజాయి మొక్కలను ధ్వంసం చేసిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై సందీప్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బాజీరావుగూడ గ్రామంలో ఓ రైతు వ్యవసాయ చేనులో 48 మొక్కలు, భూసిమెట్ట క్యాంపు గ్రామంలోని ఓ రైతు వ్యవసాయ క్షేత్రంలో 370 మొక్కలు సాగు చేస్తున్నట్లు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. గంజాయి మొక్కలను ధ్వంసం చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



చింతలమానెపల్లి మండలంలోని రవీంద్రనగర్ గ్రామం

# బెంగాలీలే నిర్ణేతలు!

- సిర్పూర్‌లో వారే కీలకం
- నియోజకవర్గంలో 20 వేల మంది ఓటర్లు
- 17 గ్రామాల్లో జీవనం

చింతలమానెపల్లి: మిగతా వాటితో పోలిస్తే సిర్పూర్ నియోజకవర్గం భిన్నత్వాన్ని కలిగి ఉంది. మినీ ఇండియాగా స్థానికులు పిలుచుకునే ఈ నియోజకవర్గంలో భిన్న ప్రాంతాల ప్రజలు నివసిస్తున్నారు. వీరంతా శాశ్వతంగా నియోజకవర్గంలో కలిసిపోయారు. బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చినా నియోజకవర్గ రాజకీయ ఫలితాలపై ప్రభావం చూపగలిగే బెంగాలీలు ఎన్నికల్లో కీలకంగా మారనున్నారు.

**శరణార్థులుగా వచ్చినా..**

1965లో బంగ్లాదేశ్, పాకిస్తాన్‌లో ఉన్న హిందువులు భారతదేశంలోకి రావాలని అప్పటి ఇందిరాగాంధీ ప్రభుత్వం పిలుపునిచ్చింది. సుమారు 1500 కిలోమీటర్ల దూరంలో ఉన్న బంగ్లాదేశ్‌లోని ఫరీదాబాద్, కుల్నా, జాసోర్ జిల్లాల నుండి కాగజ్‌నగర్ ప్రాంతానికి హిందువులు తరలివచ్చారు. మొదట్లో శరణార్థులుగా వచ్చినా భారత ప్రభుత్వం వీరికి భారత పౌరసత్వం అందించి అన్నిరకాల వసతులు కల్పించింది.

**ప్రత్యేక జీవన విధానం**

స్థానికులతో పోలిస్తే బెంగాలీల జీవన విధానం కొంత భిన్నంగా ఉంటుంది. వ్యవసాయం ప్రధాన వృత్తిగా జీవించే బెంగాలీలు తమ సంస్కృతి సంప్రదాయాలను కొనసాగిస్తున్నారు. సంప్రదాయ పంటలు, వంటకాలను స్థానిక ప్రజలకు పరిచయం చేశారు. ఆధునికతకు పెద్దపీట వేస్తారు. హిందూ సంప్రదాయ పండుగలను పాటించే వీరికి దేశభక్తి కూడా ఎక్కువే. ఈజ్‌గాం, రవీంద్రనగర్ గ్రామాల నుంచి సుమారుగా 250 మందికి పైగా దేశసేవలో వివిధ హోదాలలో సైనికులుగా పనిచేస్తున్నారు. అన్నిరంగాల్లో రాణిస్తున్న బెంగాలీలు రాజకీయంగా చైతన్యం కలిగి ఉంటారు.

**రాజకీయాలలో బెంగాలీలు**

భారత స్వాతంత్య్ర పోరాటంలో తమదైన ముద్రవేసిన బెంగాలీలు రాజకీయంగా తమ ఆలోచనలను పంచుకుంటున్నారు. ఈజ్‌గాం నుంచి దేశస్థాయిలో పలు ఉద్యమాలు, కార్మిక పోరాట సంఘాలలో ప్రాతినిధ్యం వహించారు. నియోజవర్గ స్థాయిలో నాయకత్వం వహిస్తున్నారు. ఆయా రాజకీయ పార్టీలకు బెంగాలీల నాయకత్వం ఆవశ్యకత ఏటా పెరుగుతోంది. ఐకమత్యాన్ని చాటే బెంగాలీల ఓట్లు ఒకే పార్టీకి అనుకూలంగా ఉండే అవకాశాలు ఉన్నాయని ఆయా పార్టీలు ఆశాభావం వ్యక్తం చేయడం వీరి ప్రాధాన్యతను తెలియజేస్తుంది.

**డిమాండ్లు..**

తమకు కుల గుర్తింపు కల్పించాలనేది బెంగాలీల ప్రధాన డిమాండ్. రాబోయే ఎన్నికల్లో స్థానిక పార్టీలతో పాటు జాతీయ పార్టీలు పోటీ పడుతుండగా వీరి సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పంటల సాగుకు, చేపల పెంపకానికి నీటి సరఫరా అందించాలని, గ్రామాల్లో బెంగాలీ భాషా బోధన చేయాలని, బెంగాలీలను ఉపాధ్యాయులుగా నియమించాలని డిమాండ్ చేస్తున్నారు.

### 17 గ్రామాలు.. 20 వేల ఓటర్లు

1965లో బంగ్లాదేశ్ నుంచి వచ్చిన వారికి కాగజ్‌నగర్ శివారు ప్రాంతంలో ప్రభుత్వం శిబిరాలను ఏర్పాటు చేసింది. ఈజ్‌గాం వద్ద నజ్రుల్‌నగర్, తదితర గ్రామాల పేరుతో మొత్తం 14 క్యాంపులు (శిబిరాలు) ఏర్పాటు చేసింది. అనంతరం 1976లో అప్పటి కౌటాల మండలంలోని బాబాపూర్ శివారులో రవీంద్రనగర్ పేరుతో రెండు గ్రామాలు, సిర్పూర్(టి) మండలం లక్ష్మీపూర్ వద్ద మరో గ్రామం ఏర్పాటు చేసింది. ఉపాధి కోసం కుటుంబానికి ఐదెకరాల వ్యవసాయభూమి, 8 గుంటల నివాసస్థలం ఇచ్చింది. ఏడాదిపాటు రేషన్, ఇతర వస్తువులను ఉచితంగా సరఫరా చేసింది. మొత్తం 17 గ్రామాల్లో సుమారు 26 వేల జనాభా, 20 వేల ఓటర్లు ఉన్నారు. నజ్రుల్‌నగర్ పరిధిలోని 14 గ్రామాల్లో 13,500, రవీంద్రనగర్‌లో 2,500, లక్ష్మీపూర్‌లో 600, మిగతావారు నియోజకవర్గాల్లోని వివిధ ప్రాంతాల్లో ఉన్నారు.

### కుల గుర్తింపు కోసం పోరాటం

బెంగాలీలుగా ఉన్న వీరికి ఆయా కులాల అనుసారంగా గతంలో ప్రభుత్వం కుల ధృవీకరణ పత్రాలను అందజేసినా ఆతర్వాత నిలిపి వేసింది. గతంలో రవీంద్రనగర్ సర్పంచ్‌గా పనిచేసిన పలువురు ఎస్సీ ధృవీకరణ పత్రాలతో గెలుపొందారు. పదేళ్ల క్రితం స్థానిక సంస్థల ఎన్నికల్లో రవీంద్రనగర్ ఎంపీటీసీ స్థానాన్ని బీసీలకు కేటాయించగా గ్రామస్తులు ఎన్నికలను బహిష్కరించారు. స్థానికేతరులు సైతం పాల్గొనకుండా బెంగాలీలకు మద్దతు తెలిపారు. ఆర్మీలో సైనికులుగా పనిచేస్తున్న యువకులు తమకు కుల ధృవీకరణ పత్రాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థులు విద్యాపరమైన హక్కులను కోల్పోతున్నారు. దివంగత రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీని కలిసి తమ సమస్యను విన్నవించారు. అన్ని పార్టీలు వీరికి మద్దతు తెలియజేస్తున్నా సమస్యకు పరిష్కారం మాత్రం లభించడం లేదు.

### సాగునీరు అందించాలి



వ్యవసాయం ప్రధాన వృత్తిగా జీవిస్తున్నాం. సాధారణ పంటలతో పాటు, కూరగాయలు, కొన్ని రకాల ప్రత్యేక పంటలు పండిస్తున్నాం. చేపల పెంపకం కూడా చేపడుతున్నాం. వీటికి సాగు నీరు అత్యంత అవసరం. స్థానికంగా పథకాలను ఏర్పాటు చేసి సాగు నీరందించేందుకు చర్యలు తీసుకోవాలి.

– సుశీల్ మండల్, సర్పంచ్, రవీంద్రనగర్

### బెంగాలీ భాష బోధించాలి



మా సంస్కృతిని కాపాడుకోవాలంటే బెంగాలీ భాషను మర్చిపోకుండా ఉండాలి. మాతృభాష అయిన బెంగాలీ మాధ్యమంగా పాఠశాలలను ఏర్పాటు చేయాలి. పదో తరగతి వరకు మాతృభాషగా బెంగాలీ భాషను బోధించాలి. బెంగాలీ గ్రామాల పాఠశాలల్లో బెంగాలీ ఉపాధ్యాయులను నియమించాలి.

– సమీర్ గుప్తా, ఉపసర్పంచ్, నజ్రుల్‌నగర్

### ఏ-ఫారం, బీ-ఫారం అంటే?

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎన్నికల సమయంలో తరచూ ఏ-ఫారం, బీ-ఫారం పేర్లు వింటుంటాం. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల గుర్తులు అభ్యర్థులకు రావాలంటే వీటి అవసరం ఉంటుంది. అవేమిటో?.. ఎలా ఇస్తారో? తెలుసుకుందాం.

**ఏ-ఫారం అంటే...**

పార్టీ తన అభ్యర్థిగా ఎవరినైతే ఎంపిక చేస్తుందో వారికి బీ-ఫారం అందజేస్తారు. బీ-ఫారం అందించే వ్యక్తికి ముందుగా ఇచ్చేది 'ఏ' ఫారం. పార్టీ ఎవరిని ఎంపిక చేసి ఏ-ఫారం అందిస్తుందో వారికి మాత్రమే బీ-ఫారం అందిస్తారు. ఏ-ఫారం అందుకున్న పార్టీ అభ్యర్థి ఎన్నికల అధికారులకు అందజేస్తారు.

**బీ-ఫారం అంటే...**

గుర్తింపు పొందిన జాతీయ, ప్రాంతీయ పార్టీలు తమ పార్టీ నుంచి ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు వీరేనని గుర్తించేలా ఇచ్చేదే బీ-ఫారం. పార్టీ అధ్యక్షుడు, ప్రత్యేకంగా నియామకమైన ప్రతినిధులు ఈ బీ-ఫారం అందిస్తారు. నామినేషన్ వేసే సమయంలో ఎన్నికల అధికారులకు ఈ ఫారం దాఖలు చేస్తేనే సదరు అభ్యర్థికి పార్టీకి సంబంధించి ఎన్నికల గుర్తు కేటాయిస్తారు.

### లక్సెట్టిపేట నుంచి మంచిర్యాల ..




మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఉన్న సమయంలో 1952లో లక్సెట్టిపేట నియోజకవర్గం ఏర్పాటు జరిగింది. 2004 వరకు అదేపేరుతో కొనసాగింది. మొదటి ఎమ్మెల్యేలుగా విశ్వనాథరావు, కోదాటి రాజమల్లు 1952 నుంచి 57 వరకు సోషలిస్టు పార్టీ ఎమ్మెల్యేలుగా ఉన్నారు. చివరి ఎమ్మెల్యేగా నడిపెల్లి దివాకర్‌రావు ప్రాతినిధ్యం వహించారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజన నేపథ్యంలో లక్సెట్టిపేట నియోజకవర్గం 'మంచిర్యాల నియోజకవర్గం'గా మారింది. మంచిర్యాల నియోజకవర్గం మొదటి ఎమ్మెల్యేగా గడ్డం అరవిందరెడ్డి ఎన్నికయ్యారు.

## కార్మికులకు లాభాల వాటా చెల్లించాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

జైపూర్: సింగరేణి కార్మికులకు రావాల్సిన 32శాతం లాభాల వాటాను వెంటనే చెల్లించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ డిమాండ్ చేశారు. జైపూర్ మండలం ఇందారం ఐకే1ఏ గనిపై మంగళవారం బీఎంఎస్ ఆధ్వర్యంలో మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికలకు ముందు లాభాల వాటా ప్రకటించినప్పటికీ ఎన్నికల కోడ్ నెపంతో కాలయాపన చేస్తూ కార్మికులను మోసం చేస్తుందన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనన్నారు. సింగరేణి ఎన్నికల్లో సైతం బీఎంఎస్ బలమైన శక్తిగా ఎదిగిందని, రాబోయే రోజుల్లో సింగరేణి కార్మిక సమస్యలను దశలవారీగా పరిష్కరించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేశ్, నాయకులు కాసెట్టి నాగేశ్వర్‌రావు, వినోద్, రమేశ్, సదానందం, మొగిలి, రాజు, రాయమల్లు, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ నాయకులు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న బాల్క సుమన్

భీమారం: మండలానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు మంగళవారం ఆపార్టీకి రాజీనామా చేసి ప్రభుత్వ విప్ బాల్క సుమన్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ భరత్‌రెడ్డి, కిసాన్ మోర్చా అధ్యక్షుడు కంకణాల సుధాకర్‌రెడ్డి, బీసీ మోర్చా మండల అధ్యక్షుడు ఆవిడపు సురేష్, సెగ్యం మల్లేశ్, గుడిమల్ల బాపుతో పాటు 20 మంది పార్టీలో చేరారు. ప్రభుత్వ విప్ బాల్క సుమన్ వారికి బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ మేనిఫెస్టోకు ఆకర్షితులమై బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చెరుకు సరోత్తంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థి పీఎస్సార్ మా ప్లాట్లు ఆక్రమించాడు..

- ప్లాట్లలోకి రాకుండా అడ్డుకుంటున్నాడు..
- న్యాయం జరుగకపోతే మూకుమ్మడి ఆత్మహత్యలే శరణ్యం
- ఉద్యోగ్ దళిత్ బహుజన్ ప్లాట్ ఓనర్స్ సొసైటీ సభ్యుల ఆరోపణ



మాట్లాడుతున్న ఉద్యోగ్ దళిత్ బహుజన్ ప్లాట్ ఓనర్స్ సొసైటీ ప్రధానకార్యదర్శి జి.గోపాల్‌రావు

కాచిగూడ: తాము 40ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన ఇంటి స్థలాల ప్లాట్లను కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్సీ కే.ప్రేమ్‌సాగర్‌రావు(పీఎస్సార్) కబ్జా చేసి ప్లాట్ల వద్దకు వెళ్తే గూండాలతో చంపుతామని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఉద్యోగ్ దళిత్ బహుజన్ ప్లాట్ ఓనర్స్ సొసైటీ ప్రధానకార్యదర్శి జి.గోపాల్‌రావు, సొసైటీ ప్రతినిధులు కటారి ప్రమీల, రవీందర్‌రెడ్డి, ఎస్.ఆలీ అజ్గర్, ఏఎస్ఆర్‌కే ప్రసాద్, సుజాత ఆరోపించారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. కాప్రా పరిధిలోని వంపుగూడలో 62 ఏకరాల్లో 706 ప్లాట్లను ఒక్కో ప్లాట్ 300 గజాల చొప్పున 40ఏళ్ల క్రితం కొనుగోలు చేశామని తెలిపారు. గత 20ఏళ్ల నుంచి కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్సీ, ప్రస్తుత మంచిర్యాల నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కే.ప్రేమ్‌సాగర్‌రావు 706 ప్లాట్లలో 100 ప్లాట్లను తీసుకుని మిగతా 606 ప్లాట్ల ఓనర్లను తమ స్వంత ప్లాట్లలోకి రాకుండా గూండాలను పెట్టి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. తమ ప్లాట్లలో ఇళ్లు కట్టుకుంటే, ఇంటి స్థలాల చుట్టూ కాంపౌండ్ కట్టుకుంటే ప్రేమ్‌సాగర్‌రావు కూల్చివేశారని అన్నారు. ప్రస్తుతం ఒక్కో ప్లాట్ ఖరీదు రూ.50 లక్షల వరకు ఉంటే తనకు రూ.7, 8 లక్షలకు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని, ఇవ్వకుంటే ప్లాట్లలోకి రాకుండా అడ్డుకుంటున్నారని, ఇప్పటికే చాలామంది ప్లాట్ల ఓనర్లపై దాడులు చేయించారన్నారు. వృద్ధాప్యంతో ప్రేమ్‌సాగర్‌తో పోరాడే శక్తి లేకుండా పోయిందని, ప్రభుత్వమే తమకు న్యాయం జరిగేలా చూడాలని, లేకుంటే మూకుమ్మడిగా ఆత్మహత్యలే శరణ్యమని వారు తెలిపారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి తమకు రక్షణ కల్పించి తమ ప్లాట్లు తమకు ఇప్పించాలని వారు కోరారు.

### 'వర్క్ టూ రూల్ పాటించాలి'

శ్రీరాంపూర్: కార్మికులకు లాభాల వాటా నిలిపివేసినందుకు నిరసనగా ఉద్యోగులు వర్క్‌టూ రూల్ పాటించాలని హెచ్ఎంఎస్ కేంద్ర కమిటీ అధ్యక్షుడు రి యాజ్ అహ్మద్ మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఎన్నికల కోడ్ పేరుతో యాజమాన్యం కార్మికులకు రావాల్సిన లాభాల వాటాను నిలిపివేయడం అన్యాయమన్నారు. దీనిని నిరసిస్తూ ప్రతిరోజు ఉద్యోగులు విధుల్లో గంటసేపు వర్క్ టూ రూల్, ఆఫీస్ సిబ్బంది పెన్‌డౌన్ చేపట్టాలన్నారు. యా జమాన్యం ఇప్పటికైనా జాప్యం చేయకుండా లాభాల వాటాను వెంటనే చెల్లించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## దసరాకు ముందే లాభాల వాటా చెల్లించాలి

- ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



మాట్లాడుతున్న సీతారామయ్య

రామకృష్ణాపూర్: ముందుగా ప్రకటించిన విధంగా దసరాకు ముందే సింగరేణి కార్మికులకు లాభాల వాటా చెల్లించాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ పేరిట లాభాల వాటా చెల్లించకుండా ఉండటం సరికాదన్నారు. వాస్తవానికి ఎన్నికల కోడ్ రాకముందే 32 శాతం వాటా ఈ నెల 16నే చెల్లిస్తామని యాజమాన్యం ఈ నెల 4న సర్క్యులర్ జారీ చేసిందన్నారు. జీతాలు, లాభాల్లో వాటా, బోనస్ ఆపే హక్కు ఏ ఎన్నికల కోడ్‌కు కూడా ఉండదన్నారు. పండగకు ముందే లాభాల వాటా చెల్లించాలని, లేనిపక్షంలో ఈ నెల 20న సింగరేణి హెడ్ ఆఫీస్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. అప్పటికీ యాజమాన్యం దిగిరాకపోతే 21న సమ్మెలోకి దిగుతామని స్పష్టం చేశారు. సమావేశంలో యూనియన్ కేంద్రకమిటీ కార్యదర్శి అక్బర్‌అలీ, నాయకులు అంజనేయులు, సురమల్ల వినయ్, లింగయ్య, హరి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

### 21లోగా ఉద్యోగుల ఖాతాల్లో లాభాల వాటా?



వినతిపత్రం అందిస్తున్న జనక్‌ప్రసాద్

మందమర్రిరూరల్: ఈ నెల 21లోగా సింగరేణి కార్మికుల బ్యాంకు ఖాతాల్లో లాభాల వాటా డబ్బులు జమ అవుతాయని సంస్థ ఇన్‌చార్జి సీఎండీ, ఇంధనశాఖ కార్యదర్శి సుశీల్‌శర్మ హామీ ఇచ్చినట్లు ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని కార్యాలయంలో సుశీల్‌శర్మను కలిసి ఎన్నికల కోడ్‌కు సంబంధం లేకుండా ఉద్యోగులకు లాభాల వాటా చెల్లించాలని కోరుతూ వినతిపత్రం అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. సంబంధిత అధికారులతో చర్చించి శనివారంలోగా చెల్లించేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

### వరండాలోనే జ్వర బాధితురాలు



ఆస్పత్రి వరండాలో జ్వర బాధితురాలు

మంచిర్యాలటౌన్: బెల్లంపల్లి మండలం ఆకెనపల్లికి చెందిన గుడికందుల బాలమ్మ తన కుమార్తె కీర్తనకు జ్వరం రావడంతో మంగళవారం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చింది. వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఆస్పత్రి వరండాలోనే బెంచీపైన బిడ్డను పడుకోబెట్టుకుని రోదించింది. దూరం నుంచి వచ్చిన తమలాంటి వారిని పట్టించుకోవడంలేదని వాపోయింది. ఆస్పత్రిలో పడకలు సరిపోకపోవడంతో దూర ప్రాంతాల నుంచి వైద్యం కోసం వచ్చే రోగులు ఇలా ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

## వేర్వేరుచోట్ల భారీగా నగదు పట్టివేత

- బెల్లంపల్లిలో రూ.5.94 లక్షలు..



ఎఫ్ఎస్‌టీ అధికారికి నగదు అప్పగిస్తున్న ఎస్సై

బెల్లంపల్లి: పట్టణంలోని పలుచోట్ల మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో రూ.5.94 లక్షల నగదు పట్టుకున్నట్లు ఎస్‌హెచ్‌వో బన్సీలాల్ తెలిపారు. మందమర్రి యాపల్ ఏరియాకు చెందిన బొద్దున రమేశ్ వద్ద రూ.1.24 లక్షలు, బెల్లంపల్లికి చెందిన బండి మల్లేశ్ వద్ద రూ. 2.50 లక్షలు, టి.సూర్యకుమార్ వద్ద రూ.1.50లక్షలు, తాండూర్ ఐబీకి చెందిన షేక్‌యాజ్‌వద్ద రూ.70 వేలు స్వాధీనం చేసుకుని ఎఫ్ఎస్‌టీ టీమ్ అధికారి ఎల్తూరి సురేఖకు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు.

**మంచిర్యాలలో రూ.1.73 లక్షలు..**

మంచిర్యాలక్రైం: మంచిర్యాలకు చెందిన అక్కొండ యుగెందర్ వద్ద రూ.1.73 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రాజు తెలిపారు. రామసుధ లాడ్జి వద్ద జరిపిన తనిఖీల్లో పట్టుబడిన నగదును ఫ్లైయింగ్ స్క్వాడ్ హన్మంతరెడ్డికి అప్పగించినట్లు తెలిపారు.

**వాంకిడిలో రూ.లక్ష..**

వాంకిడి: పట్టణంలోని జాతీయ రహదారిపై టోల్ ప్లాజా వద్ద నిర్వహించిన వాహనాల తనిఖీలో రూ.1,02,320 నగదు పట్టుబడినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. మండల కేంద్రంలోని హెచ్‌పీ గ్యాస్ గోదాం ఇన్‌చార్జి వైరగడే ఆత్మరాం నగదుతో ఆసిఫాబాద్ వెళ్తుండగా పట్టుబడినట్లు పేర్కొన్నారు. సరైన ఆధారాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసినట్లు తెలిపారు.

**దహెగాంలో రూ.63,500**

దహెగాం: మండలంలోని పార్వతిపేట సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా కోత్మీర్ గ్రామానికి చెందిన బుర్ర సత్తయ్య వద్ద రూ.63,500 నగదు పట్టుకున్నట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో నగదు సీజ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

**మంచిర్యాలలో రూ.1.75 లక్షలు..**

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో ఒకరి వద్ద రూ.1.75 లక్షల నగదు పట్టుకున్నారు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఫ్లైయింగ్ స్క్వాడ్, మున్సిపల్ ఇంజినీర్ మధుకర్, సీఐ రాజు, ఎస్సై రాజేందర్ నగదును సీజ్ చేశారు.

**రూ.2 లక్షల నగదు పట్టివేత**

బెల్లంపల్లిరూరల్: మండలంలోని తాళ్లగురిజాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో పోలీసులు చేపట్టిన వాహనాల తనిఖీల్లో రూ.2 లక్షల నగదు పట్టుకున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు. మాలగురిజాలకు చెందిన శ్రీనివాస్ రూ.2 లక్షలతో బెల్లంపల్లికి ఆటోలో వెళ్తుండగా తనిఖీల్లో పట్టుబడ్డాడు. నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి సురేఖకు అందజేశారు. తనిఖీల్లో ఏఎస్సైలు లింగన్న, రాజన్న, సిబ్బంది పాల్గొన్నారు.